# కైలాసదర్శనం

## బ్రహ్మ మానస సరోవర యాత్ర

[రచన : శ్రీ పి. వి. మనోహరరావు. ప్రతులకు : రచయిత పేర - 6-4-108, బ్రాహ్మణవీధి, హనుమకొండ - 506 011, వరంగల్, ఆం. ప్ర మూల్యము : మేలుప్రతి : రు. 150/-, సాదా ప్రతి : రు. 120/-]

తీర్థయాత్రలూ, పుణ్యక్షేత్ర దర్శనం అనేవి సంకల్పించినంత మాత్రాన జరుగవు. వాటికి ప్రాక్తన సుకృతం అంగరక్షగా ఉండాలి. చేత చిల్లిగవ్వ లేని వ్యక్తికి శ్రీశైల దర్శనం ఆకస్మికంగా జరుగుతుంది. కోటి రూపాయలున్నవాడు కోటిపల్లి వెళ్ళలేడు. ఇక కైలాస దర్శనం ఎలా అవుతుంది. ఇరవై తొమ్మిది దినాలలో కైలాసం, మానససరోవరం వరకు ఉత్తర దిగ్యానం చేసివచ్చిన ధన్యాత్ముడు శ్రీ మనోహరరావు. తాను చూసినవి చూసినట్లుగా వాటికి సనాతన గ్రంథాల నుంచి ఆవశ్యక విషయం ప్రమాణసూత్రంగా ఎత్తిచూపుతూ రచించిన యీ గ్రంథం ఆ యాత్ర చెయ్యనివానికి చెయ్యాలనే ఆవేశం కలిగిస్తుంది. చేయలేనివానికి మానసికంగా ఆశ్చర్యానందానుభూతిని కలిగిస్తుంది.

ఈ గ్రంథం శృంగేరి కామకోటి సిద్ధేశ్వర పీఠాధిపతుల ఆశీః కుసుమాలంకృతమై పరమ పవిత్రభావ గ్రంథి అయింది. అందునా సిద్ధేశ్వర పీఠాధిపతుల (కుర్తాళం) అభిప్రాయం ఈ గ్రంథ విషయమును అధ్యాయ క్రమణికలో మహాభాష్య రూపాన వివరించింది. దానినిమించి ఎవ్వరూ దీనికి సమీక్ష వ్రాయనక్కరలేదు.

అన్నగారు, భారతప్రభుత్వామాత్యమణి శ్రీ నరసింహారావుగారు "తొలిపలుకు"లో ఆయా మతాచార సంపత్తిని వివరిస్తూ చెప్పిన విషయం ఈ కృషికి దివ్య రత్నాలంకృతి

ఆయా స్థలాలకు సంబంధించిన రంగురంగుల చిత్రాలు కనుల పండువుగా ఉన్నాయి. ముద్రణ మరీ ముద్దుగా ఉంది.

గ్రంథ విషయం అమూల్యమేగాని గ్రంథమూల్యం కొంచెం అమితంగా ఉంది.

# వేటూరివారి సారస్వత పరివస్య

[రచన : డా॥ పోచిరాజు శేషగిరిరావు. రామారావుపేట, పెద్దాపురం, తూ॥ గో॥ జిల్లా. వెల : రు. 75/-]

కొందరు కొన్నిమాత్రమే తెలుసుకుంటారు. అందరూ అన్నీ తెలుసుకోలేరు. కొందరు కొన్నిమాత్రమే చేస్తారు. అన్నీ అందరూ చెయ్యలేరు. కొందరినీ అందరినీ ఒప్పించి మెప్పించే పనులు నూటికి కోటికి ఒక్కరు చేస్తారు. మన తరంలో అలా చేసిన మహా కర్మయోగి సారస్వత యోగి, పరిశోధన యోగి శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి. మాటాడుతూన్నట్లు అలవోకగా చక్కని కవిత చెప్పడం ఆయనకి ఆజన్మసిద్ధం. దానికి తగిన పాండిత్యం అదృష్టవశాత్తు అబ్బింది. ఈ రెండిటినీ మించిన శక్తి పరిశోధన. ఇది సారస్వతానికే కాదు వ్యక్తిత్వ పరిశోధనకి కూడా ఆయనను సానపట్టిన రాయిని చేసింది. అది క్రమంగా యోగిని చేసిందని నా అభిప్రాయం. ఆయనతో నాకు గల పరిచయం చాలా స్వల్పం. ఆయన నాకు అన్న అవుతాడు. మా యిరువురుకున్నూ కవితా గురువులు తిరుపతి వేంకటకవీంద్ర ఘటాపంచాననులు. ఆదే మా చుట్టరికం. మా అన్న బసవపురాణ పీఠిక నాకు ఆప్యాయంగా ఇచ్చి తద్ద్వారేణ వీరశైవ వాఙ్మయం మీద ఆదరం కలిగించాడు. ఆ తరువాతనే నేను పాల్కురికి కావ్యంపై వ్యాసాలు వ్రాయడం, ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక వాటిని ప్రచురించడం జరిగింది. ఏబది సంవత్సరాల క్రిందటి సంఘటన ఇది.

'గాటంపుతమి తోట నాటుకొన్నారు

నిండారపండెనె జహంగీరు మావి' - అనే పద్యం గురువు గారికి వ్రాసిన ఉత్తరంలోది ఇప్పటికీ ఈ చరణం నా జ్ఞప్తిలో ఉంది.

'అన్నమాచార్యుడు' ఈనాడు అందరికీ కనిపించడానికి కారణం మా అన్న. శృంగార శ్రీనాథంలో శ్రీనాథుడు దర్శనమిస్తాడు.

ఆయన సంకలన గ్రంథం 'చాటుపద్య మణిమంజరి' ఎన్నో విధాల ఉపకరిస్తూంది.

ఆంధ్ర సారస్వత పరిశోధన దివ్య సరస్వతీ నాట్యరంగ భూమిగా ఆయన పునర్జన్మ.

శ్రీ శేషగిరిరావు గురువుకి తగిన శిష్యుడుగా యీ సిద్ధాంత వ్యాసపీఠం సంతరించి ఆంధ్ర వాఙ్మయ చరిత్రలో ఒక రతనాల సింగపు గద్దెను రూపొందించి చరితార్థుడయాడు.

ఈ గ్రంథం శ్రీ ప్రభాకర సారస్వతప్రభను వేయి అంచులతో చూపుతూ ఆనాడు తెలిసినవారికీ యీనాడు తెలియనివారికీన్నీ 'తెలుగు పలుకుల రాణి చిరునవ్వు వెన్నెల' ప్రభాకరశాస్త్రి రూపుదిద్దుకున్నదనే ఆనందానుభూతిని కలిగిస్తుంది.

యామిజాల పద్మనాభస్వామి